

# బాసకత బక్కమ్మకి తెలుసు

మడికాడ గుంటగింజేరాకుతో పొండ్లు తోముకోని శుబ్బరంగా ఇంటికొస్తా వుంటే, "వొరే ఆంధ్రజోతి ఎడీట్రా ఇట్రా!" అని నన్నడ్డగించుకున్నారు బజిన గుళ్లో వుండే మొగోళ్లు. (వీళ్లే కొంచిం మేల్లే. మా అత్తగారూర్లో నాకు పిల్లనిచ్చినోడైతే, "మావోడు ఆంధ్రజోతికి చీఫ్ ఎడీట్రబ్బా. రేపో ఎల్లుండో ఎడీట్రగా ప్రమోసం ఈబోతారు." అని చెప్పుకుంటా వుంటాడు.)

మనకు మొదుట్నుంచి గూడ మొగోళ్లతో ఎక్కువగా మాట్లాడే అలవాట్లు లేవు. మొగ నా కొడకల్తో ఒకటి మాట్లాడితే తక్కువ, రెండు మాట్లాడితే ఎక్కువ. నేను నెత్తి గొట్టుకుంటా బజిన గుళ్లోకి పొయ్ కుచ్చున్నా.

"అచ్చిరాస్యత దూటీలేసి కలెట్రు మమ్మల్ను సంపతా వుండాడు. దీని మింద ఒక దినం ఎడిటోరియం రాయిరా – పిలకాయిలకు అచ్చిరాలు నేర్పిచ్చే కొందికే అయ్యోర్లకు తలలు పట్టగట్టి పోతా వుంటే ఇంక పెద్దోళ్లగ్గూడా నేర్పిచ్చాలంటే అయ్యోర్లు పొయ్ ఏ ఏట్లో దూకాల అనేసి నీ ఎడిటోరియంలో వాయించిడిసిపెట్టరా!" అనన్నాడు ఏడో తరగతికి ఇంగిలిపీసు చెప్పే అయ్యోరొకడు.

"ఈ ఇద్దం అయిపొయ్ ఏదో వొగటి తేలేదాకా అచ్చిరాసిత మింద ఎడిటోరియం రాయలేన్ సామీ!" అని నేను పుల్లించి నేలేసినట్టు తేల్చి చెప్పేసినా.

"అద్సరేగాని నువ్వు పేపరోడివి గదా – ఈ చంద్రశేకర గవుర్మెట్టు చీత్తే వూడిపొయ్యే ముక్కేనంటావా? పాపం చంద్రశేకరకి మూడు మొకాల్

తెలవనట్టుండాయే! అమెరికా విమానాలకు ఆయన దగ్గిరుండి పెట్రోలు పొయ్యడం మాత్రం బలే ముదావకం.” అనన్నాడు కోళ్లపారం కాడికి దినామూ పొయ్ పేపరు చదివేటోడొకడు.

“రిజర్వేషన్ల మింద దినానికొక ఎస్సే రాసిస్తా. ఎడిటోరియం పక్కన యేస్కోరా. దీని మింద నేను గొడవ జెయ్యాలనుకుంటుండా. నా ఎస్సేలు ఈనాడోడికిస్తే లడ్డాల యేస్కుంటాడు గాని, జోతోడివి నిన్ను బెట్టుకోని –” అనన్నాడు సూదులు పొడిసే దానికి మా వూళ్లేకొచ్చిన ఆరెంపీ డాక్టరు.

మొదుటసల్లో మొగోళ్లతో మాటలే ఇంత అనర్థంగా వుంటాయి. పెద్దపెద్ద చదువులు చదూకున్న మొగోళ్ల మాటలైతే ఇంగా నాశినంగా వుంటాయి. సమియం వొచ్చింది గాబట్టి చెప్తా–

నేనొక మూడేండ్లు ఐద్రాబాదులో వుజ్జోగం చేసినాన్లే. ఆడ సందేలయితే చాలు ఏదో ఒక మీటంగి బెటేస్తారు. సమాజం – సాహిత్యం, సమాజం– మానవ సంబంధాలు, సమాజం – మార్క్సిజం, సమాజం – భాషాశాస్త్రం... ఈ మాదిర్తో సమాజం తర్వాత ఒక డేష్ బెట్టి అన్నెం పున్నెం తెలవని ఆ సమాజం పక్క ఇంకేదో ఒక పదం పెట్టి మీటంగి బెట్టేస్తారు. ఈ మీటంగుల్లో మాట్లాడే వోళ్లు ఎక్కువగా పొప్సార్లు, లక్సర్లు. వీళ్లకైతే లీవులు దండిగా వుంటాయి. పైగా సందేలయితే ఇండ్లకొచ్చేసే ఉద్యోగాలు గూడా. ఇంట్లో గమ్మనుండేదెందుకులే అన్జెప్పి సందేళ సందేళ మైకుల ముందు కొచ్చేస్తారు. ఐద్రాబాదులో చేకూరి రామారావు (పాపం మా బూశమ్మది గూడ ఈ ఇంటి పేరే!) అని వొక పొప్సారు వుండాడు. ఒక మీటంగిలో అద్యచ్చుడుగా, ఇంగొక మీటంగిలో ప్రధాన వక్తగా, మరొక దాంట్లో ముక్కె అతిథిగా ఈ మాదిర్తో ఆయన కనబడని మీటంగంటూ వుండదులే.

ఒక సందేల పూట ఆయన సమాజం – సాహిత్యం అనే టాపిక్కు మింద మాట్లాడతా వుండాడు. సాహిత్యం (అంటే కతలూ అవీలే!) సమాజంలో నుంచే పుడతాది. అది ఆకాశంలో నుంచి దబీమని నేల పడదు. సమాజంలో గూడా మహరాజులూ బీదలూ వున్నట్టే సాహితీవేత్తల్లో గూడా మహారచీతలూ మామూలు రచీతలూ వుంటారు. మహా రచయితలు మహరాజుల గురించి, మామూలు రచయితలు మామూలు వాళ్ల గురించి రాస్తారు.”

ఈ మాటలకు ఇద్దురు తప్పట్లు కొట్టేసినారు. నా పక్కనుండే వోడైతే నోటు బుక్కు తీసి ఆ ముత్యాలను ఏరి పెట్టుకునేసినాడు.

నోట్ బుక్కోడికి ఏదో డవుటొచ్చి పేనాతో తల్లో గీరుకుని పైకి లేచి, "సాహిత్యం సమాజంలో నుంచి పుడతాదని అన్నారు. నోట్ చేసుకున్నాను. మరి, ఆ సమాజం ఎందులో నుంచి పుడతాదో కొంచెం చెప్తారా – నోట్ చేసుకుంటాను." అనడిగినాడు.

"చాలా మంచి ప్రశ్న." అని ఆయన మెచ్చుకోని ఆ ప్రశ్నకు ఇలావరిగా సమాదానం  జేప్పేదానికి మళ్లుకున్నాడు.

అబ్బ! కజ్జెప్తే రంజకంగా వుండాల గాని, ఇదేంది? కతలో అందురూ మొగోళ్లే వుంటే (చెప్పేవోడితో సఖా!) అది ఇట్టనే ఏడస్తాది.

పాండురోగం బట్టిపొయ్‌న ఈ కతకు నవ్వు మొకం ప్రసాదించు బక్కత్తా – అంటా నేను బక్కత్త దగ్గిరికి పొయ్ కుచ్చున్నానో లేదో "ఏరక తినే కోడి ముక్కులో ముల్లిరిగి పాయ గద సినబ్బా!" అనింది.

కోడి ఎన్ని పెంట కుప్పల్ను కలబెట్టి ముక్కుతో ఏరుకోని తింటే దాని కడుపు నిండేది! అట్టా కోడి ముక్కులో ముల్లిరిగితే – ఆహా–

"ఏం జరిగిందత్తా?" అన్నా.

"మిసినీ కాయిలు కాలిపొయ్యింది. అయిదు నూర్లే గావాల్నో ఆరు నూర్లే గావాల్నో!" అని మదన పడింది.

నేనా ఇంట అడుగు బెట్టే కొందికి బక్కమ్మ మూతి మూరడు పొడుగు బెట్టుకోనుండింది. బక్కదాని కూతురు దనలచ్చిం గూడా అదే వాటంతో వుండింది. అంటే అమ్మాగూతురికిద్దరికీ లగడా పడినట్టుండాది. బక్కత్తకు మొగదిక్కు లా. గంగులు బావ చచ్చిపొయ్ నాలుగేండ్లు కావస్తుండాది. కొడుకింకా చేతికందలా. దనలచ్చింకి పెండ్లి జేసింది. సేద్యం జరిగితింది గదాని బక్కత్త అల్లుణ్ణి ఇంట్లో పెట్టుకొనింది.

"అదిగాదు సినబ్బా. వూళ్లో అందురూ ఎట్టెట్ట చేస్కోని ఎట్టెట్ట బతకతా వుండారు. మాకు అదంతా ఏం లేదబ్బా. మడి మద్యానం చేను సందేళ.

ఇదీ మా వాటం. పది రూపాయలుంటే సారా పొట్లాం. అయిదు రూపాయ లుంటే కల్లుముంత. రెంద్రూపాయ లుంటే బీడీకట్ట. చేతిలో పదిపైసాలే వుండిందనుకో – ఒక మిటాయ తీస్కునేది నోట్లో యేస్కోని చప్పరిస్తా తిరిగేది!" అల్లుడు అని పేరు జెప్పకుండా అనేదానికి బెట్టుకొనింది బక్కత్త.

దాన్నేమన్నా వొప్పుకుంటాది గాని మొగుణ్ని అనగూడదు. ఇదీ దనలచ్చిం సిద్దాంతరం.

"ఏం బావా! ఆ మొగోడు సేద్యమనేది చెయ్యకనే వుంటే ఆ బొట్టలోకి పదైదు మూటల వొడ్ల గింజలు ఎట్టొచ్చుంటాయి? ఆ మొగోడు కొంచేపు గసార్చుకోగూడదు – ఈమె ఈ వాటంతో నసకు తగులుకుంటాది! ఈ కొంపలో ఎప్పుడూ ఇదే రచ్చ." అని మొగుడికి సపోరటొచ్చింది దనలచ్చిం.

"చెప్పుకుంటే బైసాట్లు సినబ్బా. వాడు జేసేది సేద్యమా? వాడికన్నా కొండ మంగలోడు సుమారు. కాలు కేజీ బెండ గింజలు తెచ్చి పెట్టి ఇర్రై దినాలయ్యింది. బీట్లో మడగ్గట్టి ఒక్క చాలు దున్నినాడేమో పొయ్ చూడు. ఎద్దుల్లేవా, మడక లేదా? ఏం లేదు చెప్పు? ఏమన్నా అంటేనా? మొండికేసి మడి మొకం అనేది చూడకుండా రోడ్డు బాట తిరగతా వుండేది. యాళకంత తినేసి పొయ్యేది! ఈ అమాయకవైన పెళ్లాం ఏం అనదు. అనేదంతా ఈ గయ్యాళి అత్తే! యాళదప్పి పనిచేసే కన్నా ఆ పని చెయ్యకనే వుంటే మేలు. బెండకాయలు కేజీ నాలుగు రూపాయలమ్మతా వుండాయిప్పుడు. అవి ఎనపై పైసల కాడికొచ్చినాక నా అల్లుడు కయ్య దున్ని – నాటబోతాడు! ఏదన్నా వొక్కమాట అంటే చాలు – ఆ బొట్ట చూపించేది, మేం చెయ్యకనే వుంటే ఆ వొడ్ల గింజ లెట్టొచ్చినాయని అడిగేది! ఆ వొడ్ల గింజలు తెచ్చి ఇంట్లో పోసి నలపైనాళ్లయ్యింది. మూల కుండలోకి మూడిత్తులొచ్చినాయి, ఇంక మనకేంలే అని వొక్క పని అంటుకునేది లా. ఆ గింజలు ఎన్ని నాళ్లొస్తాయి. మూడు నెలల్లో వూది పారెయ్యమా? పనిడిసి పని చేసే వోడే లోకం మింద మొగోడు! తెల్లారి చద్ది తాగినాం లే అని చెప్పి మద్యానం సంగటి నిలపతామా? మద్యానం సంగటి తిన్నాం లే అన్జెప్పి రాత్రికి కూడు తినకుండా వొదల్తామా? ఇంట్లో వొడ్ల గింజలు తెచ్చి పోసేసినాం అన్జెప్పి నెల్నాళ్లు రెస్టు దీస్కోవాల్నా – గవునీరు మాదిర్తో? మొగుడింట్లో కొస్తానే గిన్నెత్తుకోని వాడికి అన్నం బెట్టేది నేర్చుకుంటే చాలదు

ఆడది! మొగోణ్ణి నసబెట్టి పనికి ఎగదోలేది ఆడది– నిజ్జమైన ఆడది! నేర్చుకోని బతుకే గుడిసేటి ముండా!"

"వుండత్తా, నోటు బుక్కు తెచ్చుకుంటానుండు. నాకు మాట దొరికితే మాణిక్యం దొరికినట్టు. మళ్ల నేను మరిచి పోతాన్ తల్లా!" అంటా నోటు బుక్కు కోసరం మా ఇంటికి పరిగెత్తినా.